క్లుప్తంగా

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు జొన్నగిరి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

తుగ్గలి: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు జొన్నగిరి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వేణుగోపాల్ గురువారం తెలిపారు. ఇటీవల కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్స్, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, టెన్నిస్‌బాల్, టార్గెట్‌బాల్ అండర్-14, అండర్-17 విభాగాల్లో ప్రతిభ కనబరిచి మొత్తం 14 మంది ఎంపికయ్యాయన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పీఎంసీ చైర్మన్ గుంత రఘు, హెచ్ఎం సునీల్ రాజ్, ఉపాధ్యాయులు అభినందించారు.

పక్కీరప్ప తాత ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆస్పరి: ఆస్పరిలో గురువారం పక్కీరప్ప తాత ఆలయంలో గురుస్వామి రామాంజినేయులు ఆధ్వర్యంలో పక్కీరప్ప తాతకు ప్రత్యేక అలంకారం, గంగ, ఆకు పూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శివ దీక్షా పరులు ఓం నమః శివాయ అంటూ భజనలు చేశారు. శివ స్వాములకు ఆస్పరికి చెందిన జమ్మప్ప భిక్ష ఏర్పాటు చేశారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

ఆలూరు రూరల్: జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వేకు రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆలూరు తహసీల్దార్ మల్లికార్జున అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సచివాలయ సర్వేయర్లు రీసర్వే చేస్తున్న సమయంలో రైతులు దగ్గరుండి వారి పొలాలకు సంబంధించిన హద్దులను తెలియజేయాలన్నారు. రైతుల సమక్షంలో సరిహద్దుల గుర్తింపు చేపడితే భవిష్యత్తులో భూములకు సంబంధించి రైతుల మధ్య ఎలాంటి సమస్యలు తలెత్తవని చెప్పారు. రీసర్వే పూర్తయితే రైతు సాగు చేసుకుంటున్న భూమి ఆన్‌లైన్ అడంగల్ ఉన్న భూమి విస్తీర్ణంలో వ్యత్యాసాలు ఉండవని తహసీల్దార్ తెలిపారు.

టెంకాయల విక్రయ హక్కుల వేలం

ఆస్పరి: మండలంలోని ములుగుందంలో వెలసిన దస్తగిరయ్య స్వామి ఉరుసు ఉత్సవాల్లో టెంకాయలు అమ్మేందుకు ఈనెల 22న దర్గాలో టెంకాయల విక్రయ హక్కుల వేలం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు గురువారం తెలిపారు. ఆసక్తి గల వారు అదే రోజు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వివరాలకు సెల్ 97051 07987 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆలూరు: దేవనకొండ మండలం గద్దెరాళ్ల గ్రామంలో కొలువుదీరిన శ్రీ మారెమ్మవ్వ దేవస్థానంలో ఈనెల 23న టెంకాయల విక్రయ హక్కుల వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.చంద్రశేఖర్ రెడ్డి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 23న ఉదయం 10 గంటలకు దేవస్థానం ఆవరణలో వేలం పాట నిర్వహిస్తామన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో శుక్రవారం అమీలియో హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆస్పత్రి ఎండీ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 200 మందికి వైద్య పరీక్షలు చేసి 20 మందిని కర్నూల్ హాస్పిటల్‌కు రెఫర్ చేసినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ బోయ మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ బాషా

తుగ్గలి:మండల పరిధిలోని పెండేకల్లు, మారెళ్ల, బొందిమడుగుల గ్రామ సచివాలయాలను గురువారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ఎం బాషా తనిఖీ చేశారు. సిబ్బంది, వలంటీర్ల హాజరు, బయోమెట్రిక్‌ను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సచివాలయాలసేవలను మరింత విస్తృతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ వీరరాజు, ఆర్ఐ సుధాకరరెడ్డి ఉన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు మోడల్ పరీక్ష

మద్దికెర:కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న యువకులను ప్రోత్సహించేందుకు ఆపద్బాంధవ సేవాసమితి ఆధ్వర్యంలో మోడల్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రంగస్వామి, ఆ సంఘం అధ్యక్షుడు చొక్కా సునీల్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక కేవీఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 60 మంది అభ్యర్థులకు మోడల్ టెస్టులు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అగస్టీన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవికుమార్, నరేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి పనులు కల్పిస్తాం

- గ్రామాల్లో అడిగిన వారందరికీ ఉపాధి పనులు
- ప్రతి రోజూ లక్ష మందికి పని చూపేందుకు చర్యలు
- డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి



గుడెంపాడు వద్ద ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

కృష్ణగిరి: జిల్లావ్యాప్తంగా లక్ష్యానికి మించి కూలీలకు ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. కృష్ణగిరి మండల పరిధిలోని గుడెంపాడు గ్రామ సమీపంలో గురువారం జరుగుతున్న కాల్వ మళ్లింపు పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా రోజుకు 35 వేల మంది ఉపాధి పనులకు వస్తున్నారని, ఈ నెల చివరికల్లా ఈ సంఖ్యను 50 వేలకు పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వచ్చే నెల నుంచి రోజుకు లక్ష మందికి పనులు కల్పిస్తూ కోటి మందికి పని కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. గ్రామాల్లో అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించడమే లక్ష్యంగా పని చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులకు ఉపయోగపడే పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చేసిన పనులకు త్వరగా వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కూలీలు పీడీ దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి రోజూ రూ.250 వేతనం వచ్చేలా పని చేయాలని, వేతనాలు ఎప్పటికప్పుడు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీఓలు అబ్దుల్‌షకూర్, శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రతాప్, హుసేన్, మధురామకృష్ణ, సీనియర్ మేటీలు సుధాకర్‌రెడ్డి, మాధవకృష్ణ తదితరులు వెంట ఉన్నారు.

రైతన్న డైరీ ఆవిష్కరణ



ఆస్పరిలో రైతన్న డైరీని ఆవిష్కరిస్తున్న మండల సొసైటీ చైర్మన్ గోవర్ధన

ఆస్పరి: ఆస్పరి సొసైటీ కార్యాలయంలో గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో రైతన్న డైరీని మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఖరీఫ్, రబీ సీజన్ లోసాగుచేసే పంటలపై రైతులకు డైరీలో సూచనలు, సలహాలు ఉండడం వల్ల రైతులకు ఉపయోగ పడుతుందన్నారు. సీఈఓ అశోక్, రైతు సంఘం నాయకులు నాగేంద్రయ్య, కృష్ణమూర్తి, బ్రహ్మయ్య, రామాంజనేయులు, రంగస్వామి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ఫ్యామిలీ డాక్టర్



ఆలూరు సచివాలయం-3 వద్ద వైద్య శిబిరంలో సేవలందిస్తున్న సిబ్బంది

ఆలూరు రూరల్: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామాల్లోని ప్రజలకు వారి ఇంటి వద్దకే వైద్య సేవలను ప్రభుత్వం చేరువ చేసింది. ఈ కార్యక్రమం నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఆలూరు సచివాలయం-3 పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్-10 వద్ద మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ శిబిరం ఏర్పాటు చేసి ఓపీ(అవుట్ పేషెంట్) సేవలు అందించారు. 86 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు వైద్య పరీక్షలు చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఏఎన్ఎంలు, 104 సిబ్బంది ఆశావర్కర్లు ఉన్నారు.

చిరుధాన్యాలలో పోషక విలువలు



చిరుధాన్యాల వంటలపై డెమో ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్త అపర్ణ

ఎమ్మిగనూరురూరల్: చిరుధాన్యాలలో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయని కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ, డాక్టర్ అపర్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో చిరుధాన్యాల ఉత్పత్తులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ.. మహిళలు, పిల్లలు విటమిన్ లోపాల నుంచి బయటపడాలంటే పోషక విలువలుండే ఆహారం తీసుకోవాలన్నారు. రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు తయారు చేయడంపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, వీరేష్, కరుణ, అరేకల్, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

అందరికీ ఉపాధి పనులు కల్పిస్తాం



ఉపాధి హామీ పథకం కూలీలతో మాట్లాడుతున్న సర్పంచ్ అరుణకుమార్

ఆలూరు: గ్రామంలో వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తామని, ఇతర ప్రాంతానికి వలస వెళ్లి ఇబ్బందులు పడకుండా గ్రామంలోనే ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని తెర్నెకల్ సర్పంచ్ అరుణకుమార్ సూచించారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మికులు పిల్లాపాపలతో కలసి వలస వెళ్లి అనారోగ్యం పాలుకావద్దన్నారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ పనులు కల్పించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఏపీఎం కృష్ణమూర్తి, ఈసీ రంగస్వామి, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రత్నం, ఉప సర్పంచ్ సులోచనమ్మ, ఎంపీటీసీ నామాల శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

సచివాలయ కన్వీనర్లు బాధ్యతగా సేవలందించాలి

ఆలూరు: నూతనంగా మండల సచివాలయ కన్వీనర్లుగా నియమితులైన వారు బాధ్యతగా సేవలందించా లని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు నియమితులైన సచివాలయ కన్వీనర్లు గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మూడున్నరేళ్ల కాలంలో మంజూరు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ వివరించాలని, అర్హులై ఉండి పథకాలు అందని వారికి సత్వరం లబ్ధి చేకూర్చేలా కృషి చేయాలన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సచివాలయ కన్వీనర్లు

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ లక్ష్యం మేరకు అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేలా పనిచేయాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నూతనంగా నియమితులైన మండల సచివాలయ కన్వీనర్లకు సూచించారు. జగనన్న గృహ సారథుల (జేసీఎస్) పట్టణ కన్వీనర్‌గా నియామకమైన బంగి శ్రీరామ్‌తో పాటు, నందవరం, గోనెగండ్ల మండలాల సచివాలయ కన్వీనర్లు చాంద్‌బాష, మనోహర్‌రెడ్డి గురువారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, బీఆర్ బసిరెడ్డిని ఎమ్మెల్యే నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు.

కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: కోవిడ్‌లో మృతిచెందిన మున్సిపల్ కార్మిక కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప కోరారు. ఈ మేరకు గురువారం బాధిత కుటుంబాల సభ్యులు, కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి బాలరాజు, నాయకులు సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలను మానుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపణ్ణగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో.. ఈనెల 27న విశాఖలో జరిగే కార్మిక మహాగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు లాంటి సంస్థలను ప్రైవేటీకరించడం తగదన్నారు.

పొలం బడితో రైతులకు ప్రయోజనం



జొహరాపురంలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ మునెమ్మ

ఆస్పరి: మండలంలోని జొహరాపురం గ్రామంలో గురువారం వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మునెమ్మ పప్పుశనగలో పంట కోతలపై రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

క్రాప్ బుకింగ్ పక్కాగా చేపట్టండి

ఆస్పరి ఆర్‌బీకేలో ఆలూరు ఏడీఏ సునీత ఎంపీఈఓ, వీఏఏఎస్, వీహెచ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రబీలో ఈ-క్రాప్ బుకింగ్, పీఎం కిసాన్, రైతు భరోసా, తదితర ప్రభుత్వ పథకాలపై సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ లబ్ధి



ఎమ్మిగనూరు 9వ వార్డులో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల రూపంలో లబ్ధి చేకూరుతుందని నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన గురువారం మున్సిపల్ కమీషనర్ గంగిరెడ్డి, వార్డు కౌన్సిలర్ రాజరత్నంలతో కలిసి పట్టణంలోని 9వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు తిరిగి గత మూడేళ్లలో ఆ కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలను గణాంకాలతో సహా వివరించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నీ సీఎం అయ్యాక నెరవేర్చారన్నారు. పారదర్శకంగా ఒక్క పైసా అవినీతి లేకుండా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తుండటంతో కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నాయన్నారు. వార్డులో కొందరు సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, నాయకులు రాజశేఖర్, షబ్బీర్ అహమ్మద్, గట్టుఖాజ, తదితరులు పాల్గొన్నారు.

లైన్ ఇన్‌స్పెక్టర్ మృతి



ఓబులేసు (ఫైల్)

గోనెగండ్ల: మండల కేంద్రంలో విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బోయ ఓబులేసు (47) గురువారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ వ్యాధి నయం కాలేదు. గురువారం ఉదయం కర్నూలులోని తన నివాసంలో కన్నుమూశాడు. విషయం తెలుసుకున్న విద్యుత్ ఏడీ రాఘవేంద్ర, ఏఈ సుధాకర్ రావు, ఏఏఓ సుభాష్ చంద్రబోస్, లైన్‌మెన్ మాబువుసేన్, సిబ్బంది కర్నూలుకు వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి అంత్యక్రియలకు విద్యుత్ సిబ్బంది రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు.

ముగిసిన దేవర

మద్దికెర: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామ దేవర ఉత్సవాలు గురువారంతో ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాద వితరణ చేశారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

పత్తికొండ రూరల్: స్థానిక సచివాలయం-2లోని ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీఓ పార్థసారథి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులను తనిఖీ చేసిన అనంతరం ఆధార్ కేంద్రం వివరాల నమోదును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సేవల నిమిత్తం వచ్చే వారికి సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలని సూచించారు.

జయప్రదం చేయండి

ఆస్పరి: ఈనెల 20వ తేదీన హిందూపురం నుంచి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కైరుప్పల గ్రామంలో రమేష్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ పరం చేయరాదని, విశాఖను రైల్వే జోన్‌గా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బస్సు యాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. ఏఐవైఎఫ్ నాయకులు సురేష్, రేవన్, గోపీ, వీరాంజినేయులు పాల్గొన్నారు.

యోగి వేమనకు నివాళి

వెల్దుర్తి: ప్రజాకవి యోగి వేమన జయంతి పురస్కరించుకుని గురువారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి కవితాబాయ్ ఆధ్వర్యంలో వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రైవేట్ స్కూల్ చిన్నారులకు వేమన పద్యాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులందించారు. వేమన జయంతిని ఇకపై ప్రతిఏటా ప్రభుత్వం నిర్వహించనుండడంపై హర్షం వ్యక్తం చేశారు. హరిసింహనాయుడు, ఖాదర్‌బాష పాల్గొన్నారు.

మారని తీరు



హొళగుంద పీహెచ్‌సీలో వైద్యుడు లేకపోవడంతో మందులు రాసిస్తున్న స్టాఫ్ నర్స్

హొళగుంద: వివాదాలకు నిలయంగా మారిన హొళగుంద పీహెచ్‌సీలో ఉద్యోగుల తీరు మారడం లేదు. పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లు నియమితులై ఉండగా గురువారం డాక్టర్ రాధ 104లో పల్లె ప్రజలకు వైద్యం అందించేందుకు హొన్నూరుకు వెళ్లారు. మరో డాక్టర్ విధులకు హాజరు కాకపోవడంతో చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన రోగులు అక్కడే పడిగాపులు కాశారు. చివరకు స్టాఫ్ నర్స్ ఇచ్చిన మాత్రలను తీసుకుని ఇంటిదారి పట్టారు. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులకు గాను ఒకరు విధులకు హాజరవుతుండగా మరొకరు చాలా రోజులుగ విధులకు హాజరవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది మధ్య తరుచూ గొడవలు జరుగుతుండడం, ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడం లాంటి సంఘటనలతో వైద్యం కోసం వచ్చే ప్రజలకు సకాలంలో సేవలందడం లేదు. దీనిపై అనేకసార్లు ఆదోని డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతితో పాటు ఇతర ఉన్నతాధికారులు పీహెచ్‌సీని తనిఖీ చేసి హెచ్చరికలు జారీ చేసినా సిబ్బందిలో మార్పు కనబడటం లేదు. దీనిపై ఆదోని డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతిని విచారించగా హొళగుంద పీహెచ్‌సీ పరిస్థితిపై డీఎంహెచ్ఓకు నివేదిక ఇచ్చానని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

సద్వినియోగం చేసుకోండి

చిప్పగిరి: గ్రామ సచివాలయాలలో అందించే ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ సుధాకర్ రాజు, ఈఓపీఆర్డీ సంజన్న ప్రజలకు సూచించారు. గురువారం స్థానిక గ్రామ సచివాలయంలో నిర్వహించిన మొబైల్ ఆధార్ క్యాంపును వారు పరిశీలించారు. ఆధార్ క్యాంపు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. చిప్పగిరి పంచాయతీ కార్యదర్శి నాగభూషణం, డిజిటల్ అసిస్టెంట్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేటర్ లేక ఇబ్బందులు

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండాలనే ఉద్దేశంతో జగనన్న కాలనీలతో పాటు సొంత స్థలం ఉన్న వారు ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు చేపట్టింది. అయితే స్థానిక హౌసింగ్ కార్యాలయంలో గతంలో ఉన్న ఆపరేటర్ నెల రోజుల నుంచి విధులకు హాజరు కావడం లేదు. ఆపరేటర్ లేకపోవడంతో హౌసింగ్ లబ్ధిదారులకు బిల్లులు రాక, కొత్తవి మంజూరుకాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బిల్లుల కోసం కార్యాలయానికి వచ్చి నిరాశగా వెనుదిరిగి పోతున్నారు. ఆపరేటర్ రాకపోతే కొత్త వారిని నియమించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఇల్లు ఎలా నిర్మించుకోవాలని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై హౌసింగ్ ఏఈ ఉమాకాంత్‌ను ప్రశ్నించగా.. సమస్యను జిల్లా అధికారులకు కూడా తెలియజేశామని, ఇంతవరకు ఆపరేటర్‌ను నియమించలేదన్నారు.

ఘనంగా మునిస్వామి ఉరుసు

తుగ్గలి: మండల పరిధిలోని నల్లగుండ్లలో మునిస్వామి ఉరుసు ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కులమతాలకతీతంగా గ్రామస్తులు దర్గాను సందర్శించి చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అర్ధరాత్రి స్వామి ప్రతిమను గుర్రంపై ఉంచి గ్రామంలో ఊరేగింపు చేశారు.

జాతరకు ఏర్పాట్లు

హొళగుంద: ఈ నెల 31 నుంచి మూడు రోజుల పాటు జరిగే హొళగుంద సిద్ధేశ్వర స్వామి జాతరలో భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ తెలిపారు. గురువారం ఆయన ఆలయ పరిసరాలు, తేరుబజారులో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు, ఇతర చెత్త చెదారాన్ని పొక్‌లెన్, పారిశుద్ధ్య సిబ్బందితో తొలగించారు. తేరుబజారుతో పాటు గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రజలు సహకరించాలని కోరారు.

బైకు అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

వెల్దుర్తి: హైవే-44పై పట్టణ సమీపంలోని తిక్కతాత గుడి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు గాయపడ్డారు. డోన్‌కు చెందిన రఘు, మదార్‌పురంకు చెందిన మధుకృష్ణ బైక్‌పై కర్నూలు వైపు నుంచి వస్తుండగా తిక్కతాత గుడి సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. సమాచారం అందుకున్న హైవే పోలీసులు అక్కడికి చేరుకుని గాయపడిన ఇద్దరిని 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రజల పక్షాన సీపీఐ పోరాటం

కృష్ణగిరి: ప్రజల పక్షాన పోరాటాలు చేయడమే తమ పార్టీ లక్ష్యమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నబిరసూల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పులిచెర్ల గ్రామంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి రవిమోహన్, చిన్నరంగన్న ఆధ్వర్యంలో పార్టీ జెండాను అవిష్కరించారు. వారు మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, పులిచెర్ల గ్రామ కార్యదర్శి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ విధానాలు అడ్డుకుందాం

పత్తికొండ రూరల్: కేంద్రంలో బీజేపీ సర్కారు అవలంబిస్తున్న ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ విధానాలను అడ్డుకుందామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి క్రిష్టయ్య, రైతు సంఘం తాలుకా అధ్యక్షుడు కారన్న పిలుపునిచ్చారు. ఈనెల 27న విశాఖలో జరిగే కార్మిక మహాగర్జన పోస్టర్‌లను గురువారం స్థానిక చదువుల రామయ్య భవన్‌లో ఆ పార్టీ నాయకులు విడుదల చేశారు. 23, 24తేదీల్లో అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాల ఎదుట ధర్నా, 25న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ, అనుబంధ సంఘాల నాయకులు నెట్టికంటయ్య, రంగన్న, వెంకట్రామిరెడ్డి, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

శనగ రైతులను ఆదుకోవాలి

మద్దికెర: జిల్లావ్యాప్తంగా భారీగా నష్టపోయిన శనగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ కోరారు. గురువారం మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం తదితర గ్రామాలలో పర్యటించి పొలాలను పరిశీలించి రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ.. మండలంలో 22 వేల ఎకరాలలో శనగ, 8500 ఎకరాలలో పత్తి, 6 వేల ఎకరాలలో కంది పంటలను సాగు చేశారన్నారు. ఈ ఏడాది అకాల వర్షాల వల్ల దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందని, నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

ట్రాక్టర్ బోల్తా

హొళగుంద: మార్లమడికి రోడ్డులో గురువారం మొక్కజొన్న సొప్ప ట్రాక్టరు అదుపుతప్పి బోల్తాపడింది. ట్రాక్టర్‌లో ఉన్న కూలీలు, డ్రైవర్ జాగ్రత్త పడడంతో ప్రమాదం తప్పింది. వాహనం బోల్తా పడడంతో ఆ మార్గంలో కొద్దిసేపు పెద్ద వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆదోని ప్రాంతానికి చెందిన రైతులు కర్ణాటకలో మొక్కజొన్న చొప్ప కొనుగోలు చేసి హొళగుంద మీదుగా ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్నారు. మార్లమడికి దాటి వస్తుండగా రోడ్డు మధ్యలో గుంతలు ఉండడంతో వాటిని తప్పించే క్రమంలో ట్రాక్టరు అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవరుతో పాటు కూలీలు అప్రమత్తమై పక్కకు దూకేయడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానిక రైతులు తాళ్లు కట్టి ట్రాక్టరును సరిచేశారు. మార్లమడికి రోడ్డు గుంతలతో అధ్వానంగా వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సచివాలయాల సేవలు విస్తృతం చేయండి

నందవరం: గ్రామ/వార్డు సచివాలయాల సేవలు విస్తృతం చేయాలని తహసీల్దార్ నిత్యానందరాజు సిబ్బందికి సూచించారు. గురువారం ముగతి గ్రామంలోని సచివాలయాలను తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల ద్వారా గ్రామంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సేవలను త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామస్తులకు సత్వర సేవలు అందిచేలా చూడాలని ఆదేశించారు. అలాగే ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలని, డబుల్ ఎంట్రీ ఓటర్ కార్డులు, ఓటర్ జాబితాల్లో మిస్ మ్యాచింగ్ ఫొటోలను తొలగించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరగా పూర్తి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి జయరాం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: గ్రామ, వార్డు సచివాలయాల సేవలు విస్తృతం చేయాలని ఎంపీడీఓ అల్లబకాష్ అన్నారు. ఆయన గురువారం స్థానిక సచివాలయం-1, 2 ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ సర్వే వేగవంతం చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సిబ్బంది భాగ్యమ్మ, శివప్రసాద్, రేవతమ్మ, రామలక్ష్మి, నిర్మల సీఓ జిలాన్ తదితరులు ఉన్నారు.